RNI: APTEL/2012/48887

ప్రజాబాట

ఎడిటర్: సిద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి

డైలీ డిజిటల్

08.07.2026 | బుధవారం

https://epaper.prajabaata.in | పేజీలు : 1

భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే (1978-1985), నేషనల్ డెమక్రటిక్ పార్టీ, ప్రజా చైతన్య వేదిక వ్యవస్థాపకులు, ప్రత్యేక తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు, నిత్యవిద్యార్థి, గోదావరి జలాల సాధానోద్యమకారుడు, మూసీ నది పరిరక్షణోద్యమకారుడు, గ్రామంలోని పేద ప్రజలకు మూడు వందల ఎకరాల తన సొంత భూమిని ఉచితంగా పంపిణీ చేసిన భూదాత, బీబీ నగర్ నిమ్స్ (ప్రస్తుతం ఎయిమ్స్) సాధానోద్యమకారుడు తెలంగాణ మట్టి మనిషి కొమ్మిడి నర్సింహ్మారెడ్డి (83) నిమ్స్ దవఖానలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. వృద్ధాప్య అనారోగ్య కారణాలతో నెల రోజుల కిందట దవాఖానలో చేరిన ఆయన ఆరోగ్యం మరింత విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆయన మరణించారని నిమ్స్ వైద్యులు ప్రకటించారు. బుధవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కొమ్మిడి కుటుంబ సభ్యులు వెల్లడించారు.

భువనగిరి మాజీ ఎమ్మెల్యే..

కొమ్మిడి నర్సింహ్మారెడ్డి మృతి

- అనారోగ్యంతో నిమ్స్‌లో చేరిక
- చికిత్స పొందుతూ మంగళవారం తుది శ్వాస విడిచిన కొమ్మిడి
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు, అభిమానులు
- భువనగిరి అసెంబ్లీ పరిధిలో విషాదచాయలు
- ఈరోజు కొమ్మిడి అంత్యక్రియలు

కొమ్మిడి నర్సింహారెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పుట్టి పెరిగారు. కొమ్మిడి రాంచంద్రారెడ్డి, లక్ష్మమ్మ దంపతులకు ఆరుగురు సంతానం. (కోదండరామిరెడ్డి, అమృతమ్మ, శశిరేఖ, సుగుణ, నరసింహారెడ్డి, బుచ్చిరెడ్డి) 1943 మార్చి 10వ తేదీన కొమ్మిడి నర్సింహారెడ్డి జన్మించారు. నర్సింహారెడ్డి అతని భార్య సుకన్యమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఇద్దరు కూతుళ్లు రజిని రెడ్డి, రాధిక రెడ్డి. నర్సింహారెడ్డి గారు తన పిల్లలను మాత్రం రాజకీయాలకు దూరంగా పెంచారు. కొమ్మిడి నరసింహారెడ్డి భార్య అనారోగ్యంతో రెండు సంవత్సరాల క్రితం మరణించారు. కొమ్మిడి నర్సింహారెడ్డికి ఊహా తెలిసినప్పటి నుంచి తుది శ్వాస విడిచేవరకు తెలంగాణ రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం పరితపించారు. భువనగిరి ఎమ్మెల్యేగా రెండు పర్యాయాలు భారీ మెజార్టీతో గెలిచిన కొమ్మిడి ప్రజలకు నిస్వార్థంగా సేవలందించారు. పేదల సమస్యల పట్ల, వాటి పరిష్కారం పట్ల నిరంతరం ఆలోచిస్తూ వారికి సేవలు అందించే క్రమంలోనే ప్రజాభిమానంతోనే ఆయన రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ఎంత ఎదిగినా, ఎక్కడ ఉన్నా అందరితో కలుపుగోలుగా ఉండేవాడు. తాను ఎల్లప్పుడూ జనంలో ఒకడుగా భావిస్తూ అక్కడి ప్రజలతో కలిసి నడిచేవారు. ఆయన చిన్నప్పటి నుంచే సమాజం పట్ల, పేదల పట్ల అత్యంత నిబద్ధతతో వ్యవహరించేవాడు. ఈ విషయంలో తన పెద్దన్న కోదండరామిరెడ్డి ప్రభావం తనమీద ఉన్నదని చెప్పేవాడు.

నిరాడంబర జీవితం...

రెండు పర్యాయాలు (1962 1970) వరకు బ్రాహ్మణపల్లి సర్పంచ్ గా, 1969 తొలిదశ తెలంగాణ ఉద్యమ సమయంలో సర్పంచ్ హోదాలో ఉంటూనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్షతో తెలంగాణ పోరాట సమితి భువనగిరి తాలూకా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. భువనగిరి తాలుకా సమితి ప్రెసిడెంట్‌గా రెండు దఫాలుగా పని చేశారు. అనంతరం 1978లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఉమ్మడి నల్గొండ జిల్లా భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం శాసన సభ్యుడిగా స్వతంత్ర సమరయోదుడు, మాజీ మంత్రి కొండ లక్ష్మణ్ బాపూజీపై 62.75 శాతం ఓట్ల మెజార్టీతో గెలిచారు. అనంతరం 1983 సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతటా ఎన్టీ రామారావు ప్రభంజనం కనిపించినా, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి వరుసగా రెండవసారి కాంగ్రెస్ పార్టీ నుండి కొమ్మిడి నర్సింహారెడ్డి శాసన సభ్యుడిగా మీసాల బిక్షపతిపై 33.80శాతం మెజార్టీ ఓట్లతో విజయం సాధించారు. ఈ రెండు దఫాలుగా కూడా కొమ్మిడి నర్సంహ్మారెడ్డి ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయలేదు. ఒక్క రూపాయి కూడా పంపిణీ చేయలేదు. ఆయన రెండు పర్యాయాలలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార ఖర్చు కోసం కేవలం రూ.15 వేలు మాత్రమే ఖర్చు చేశారు. అయితే 1985లో వచ్చిన మధ్యంతర ఎన్నికలలో యువతకు అవకాశం ఇవ్వాలనే సంకల్పంతో పాటు, ఆ ఎన్నికల నుంచి వివిధ రాజకీయ పార్టీలు, ఆయా పార్టీల నాయకులు అసెంబ్లీ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో విరివిగా డబ్బులు, మద్యం, సారా, బీరు, బిర్యాని పంచుతూ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తుండటంతో విస్మయం చెందిన కొమ్మిడి నర్సింహారెడ్డి ఆ ఎన్నికలలో అసెంబ్లీ ఎన్నికల పోటీ నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు.

సొంత ఇల్లు కూడా లేదు...

ఎనమిది సంవత్సరాలు గ్రామ సర్పంచ్‌గా, రెండు దఫాలు భువనగిరి తాలుకా సమితి ప్రెసిడెంట్‌గా, రెండుసార్లు ఎమ్మెల్యే(1978 నుంచి 1985 వరకు)గా గెలిచినప్పటికీ ఆయన తన సొంతంగా ఆస్తులు సంపాదించుకోలేదు. బ్రాహ్మణపల్లి గ్రామంలో నర్సింహారెడ్డి తండ్రి రాంచంద్రారెడ్డి వందల సంవత్సరాల కిందట నిర్మించిన ఇంటిలో నుంచే ఆయన ప్రజలకు సేవలందించారు. ఆయన ఆర్టీసీ బస్సులలోనే తిరిగేవాడు. బజాజ్ చెతక్ స్కూటర్ పైనే అసెంబ్లీ సమావేశాలకు వెళ్లేవారు. అలాగే తాను పుట్టి పెరిగిన బ్రాహ్మణ పల్లి గ్రామంలో పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలనే గొప్ప సంకల్పంతో వందల కోట్ల విలువైన తన వారసత్వంగా వచ్చిన భూములతో పాటు, తన కుటుంబ సభ్యులకు చెందిన సుమారు 300 ఎకరాల భూములను అర్హులైన పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కానీ ఆయన మాత్రం సొంతంగా ఇల్లు కూడా సంపాదించుకోలేదు. కొద్ది రోజులు ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉన్న ఆయన అనంతరం ఫుట్‌కేసర్ సమీపంలోని సంస్కృతి టౌన్‌షిప్ (సింగపూర్ సిటీ)లో చాలా రోజులు అద్దెకున్నారు. ప్రస్తుత రాజకీయాల్లో చిన్న చిన్న పదవులు వచ్చినా, రాజకీయాల్లో తమ బంధువులు, స్నేహితులున్నా కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్న తరుణంలో కొమ్మిడి నర్సింహారెడ్డి ఆదర్శవంతమైన రాజకీయాలకు, నిస్వార్థమైన ప్రజా సేవకు పునరంకితమయ్యారు. ఎక్కడా కూడా ప్రజాధనాన్ని కొల్లగొట్టలేదు. అయితే కొమ్మిడి నర్సింహారెడ్డికి సొంతంగా ఇల్లు కూడా లేని కారణంగా రామంతాపూర్‌లో నివాసముంటున్న అతని పెద్ద కూతురు రజిని రెడ్డి ఇంట్లోనే చివరి రోజులను గడిపారు.

భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి..

దొరల కుటుంబంలో పుట్టినప్పటికీ, అతని పెద్దన్న తెలంగాణ సాయుధ పోరాటవీరుడు కోదండరామిరెడ్డి ప్రజా పోరాటాల నుంచి స్ఫూర్తి పొందిన కొమ్మిడి నర్సింహారెడ్డికి ఊహా తెలిసినప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రంలోని దీన జనుల హక్కుల కోసం, సకల జనుల బతుకు కోసం, మెరుగైన సమాజం కోసం పరితపించారు. తెలంగాణ ప్రజల సంక్షేమానికై నిరంతరం పరితపించే నిఖార్సైన, నిస్వార్థ ప్రజా నాయకుడిగా కొమ్మడి నర్సింహారెడ్డి యావత్తు తెలంగాణ ప్రజల హృదయాలలో చెక్కు చెదరని స్థానం సంపాదించుకున్నారు. అంతే కాదు అతని వేల కోట్ల విలువైన తన వందల ఎకరాల భూములను పేదలకు ఉంచితంగా పంపిణీ చేసి దొరతనం అంటే దోచుకోవడం కాదు.. పేద, మధ్యతరగతి ప్రజల జీవికకు వెన్నెముకగా నిలిచి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలవడమని చెప్పడంతో పాటు ఆచరించి చూపించిన జన నాయకుడు కొమ్మిడి నర్సింహారెడ్డి. త్యాగాలకు పునాదులు పాతిన విప్లవ యోధుడు కొమ్మిడి కోదండ రామిరెడ్డి తోబుట్టువు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి న్నర్సింహ్మారెడ్డి గారి మరణం తెలంగాణ సామాజానికి తీరనిలోటు. ప్రతిపనికి నాకేంటి, నాకెందుకులే అనుకుంటున్న ఈ రోజులలో ఎనభైయేండ్ల ఏళ్ల వయోభారంతో కూడా నిత్య చైతన్య శీలిగా ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. వయోభారంతో శరీరం సహకరించని రోజులలోను ప్రభుత్వ ప్రజా వ్యతిరేఖ విధానాలపై తన గళాన్ని విప్పారు. చివరి శ్వాస వరకు తనదైన శైలిలో ప్రజావ్యతిరేక విధానాలపై దిక్కారం ప్రకటించారు.

భూ చట్టాలకు, అక్రమ అరెస్టులపై..

తెలంగాణ రాష్ట్రంలో తీసుకువచ్చిన ప్రజా వ్యతిరేఖ, పారదర్శకత లోపించిన భూచట్టాలను కొమ్మిడి నర్సింహ్మారెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. పీవీ నర్సింహ్మారావు అమల్లోకి తీసుకువచ్చిన భూ సంస్కరణలను అమలు చేయకుండా కొత్త చట్టాల పేరుతో ప్రజల వద్ద ఉన్న భూములను ప్రభుత్వాలే దోచుకుంటున్నాయని ఆయన అనేక వేదికలపై ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్ ల్యాండ్ అక్విజేషన్ యాక్టును అమలు చేయడంలో కాంగ్రెస్ టీడీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా స్వామిక ఉద్యమాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ.. వరవర రావు, గాదె ఇన్నయ్యల అక్రమ అరెస్టులను బహిరంగంగానే ఖండించారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా, ప్రజల హక్కులను కాలరాస్తూ ప్రభుత్వాలు ప్రజాస్వామిక వాదులను అరెస్టు చేస్తున్నాయని, ఏండ్లకేండ్లు జైళ్లలో నిర్బంధిస్తున్నాయని వాటికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితం చేసి ఆయన బహిరంగ పోరాటం చేశారు.

గోదావరి జలాల సాధనే లక్ష్యంగా...

గోదావరి నదీ జలాల సాధన కోసం నరసింహారెడ్డి సాగించిన పోరాటాలు చారిత్రాత్మకమైనవి. భువనగిరి, ఆలేరు ప్రాంతాలకు సాగు నీరు అందించాలని ఇచ్చంపల్లి వద్ద గోదావరిపై బ్యారేజీ నిర్మాణం కోసం నరసింహారెడ్డి అలుపెరుగని పోరాటాలు చేశారు. గోదావరి జలాలను మూసీ నదిలోకి మళ్ళించడం ద్వారా లక్ష ఎకరాలను ఏ విధంగా సశ్యశ్యామలం చేయవచ్చో ఒక బ్లూప్రింట్ తయారు చేశారు. ఆ బ్లూ ప్రింటును ఒక పెద్ద ఫ్లెక్సీపై ప్రింట్ చేయించి, అతని వద్దకు ఎవ్వరు వెళ్లినా ఒక ఇంజనీర్‌లా వివరించేవారు. నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లోని మూసీ పరీవాహక ప్రాంతంలో జల కాలుష్యం నివారణ కోసం, మానవ వ్యర్థాలతో పాటు రసాయన వ్యర్థాలను మూసీ నదిలో కలుపొద్దని అనేక పోరాటాలు చేశారు. హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి 202 విస్తరణలో భాగంగా రంగాపురం గ్రామ ప్రజలు ఇండ్లు పొలాలు కోల్పోయి నిర్వాసితులు అయ్యారని, అవి భూదాన్ భూములంటూ ప్రభుత్వం నుండి నష్టపరిహారం చెల్లించాలని రైతుల పక్షాన పోరాటం చేశారు. 2013 మార్చి నెలలో బీబీనగర్‌లో నిమ్స్ (ప్రస్తుతం ఎయిమ్స్) ఏర్పాటు కోసం కోసం ఆమరణదీక్ష చేశాడు.

ఎన్టీఆర్ రమ్మన్నా పోలేదు..

ఎన్టీ రామారావు 1982 ఏప్రిల్ నుంచి 1983 జనవరి వరకు తొమ్మిది నెలలపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నలుమూలలా 40 వేల కిలోమీటర్లు చైతన్య రథ యాత్రలు నిర్వహించాడు. ఎన్టీఆర్ కరీంనగర్ పర్యటనలో ఉన్నప్పుడు రాజకీయ కోణంలో ఎన్టీ రామారావుతో మర్రి చెన్నారెడ్డి కలవాల్సి వచ్చింది. ఆ భాధ్యత నర్సింహారెడ్డికి అప్పజెప్పాడు చెన్నారెడ్డి. ఎన్టీ ఆఫీస్‌లో ఉన్న ఎన్టీ రామారావును కలవడానికి నర్సింహారెడ్డి నారాయణ అనే మరో నాయకుడి సహాయంతో ఎన్టీ రామారావు వద్దకు వెళ్ళాడు. చైతన్య రథంలో కూర్చుని వున్న రామారావు నరసింహారెడ్డిని నారాయణ పరిచయం చేయబోతుంటే విసుక్కున్నాడు.. అక్కడినుంచి వెళ్లండంటూ గట్టిగా అరిచాడు.. ఎన్టీ రామారావు ప్రవర్తించిన తీరు నర్సింహారెడ్డి మనసును నొప్పించింది. ఓ రాజకీయ నాయకుడికి ఉండాల్సిన లక్షణం కాదనుకుంటూ అక్కడి నుండి వెనక్కి వచ్చేశాడు. అందుకే ఆ తర్వాత ఎన్టీ రామారావే స్వయంగా తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించినా కూడా నర్సింహారెడ్డి కనీసం ఆయన వద్దకు వెళ్లలేదు. కొమ్మిడి నర్సింహారెడ్డి గారు భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన ప్రగతిశీల పోరాటాలు, ఆయన, ఆయన కుటుంబం చేసిన త్యాగాలు, నిస్వార్థమైన ప్రజాసేవ, దాన ధర్మాలు భవిష్యత్తు తరాలకు మండే కొలిమిలా స్ఫూర్తిని రగిలిస్తుందని ఆశిస్తూ..!

బూడిద సుధాకర్, జర్నలిస్టు - 7680992342

భువనగిరి మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహా రెడ్డి మృతి పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నర్సింహారెడ్డి గారు తుదిశ్వాస వరకు నీతినిజాయితీతో జీవించారని కొనియాడారు. గోదావరి జలాల సాధన, మూసీ పరిరక్షణ ఉద్యమాలను నిర్వహించి నిత్యం ప్రజల పక్షాన నిలిచారని గుర్తుచేశారు. భూదానోద్యమానికి తన 300 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప మానవతావాదిగా స్మరించుకున్నారు. 1978, 1983 సంవత్సరాల్లో రెండుసార్లు భువనగిరి నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారని పేర్కొన్నారు. నిరాడంబర జీవితాన్ని గడుపుతూ, అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడిన నర్సింహారెడ్డి గారు నేటి తరానికి ఆదర్శప్రాయుడని కొనియాడారు. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, కొమ్మిడి నర్సింహారెడ్డి గారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి గారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జేఎన్‌టీయూహెచ్‌లో భద్రతా వైఫల్యాలు

- ఎస్‌కేఎస్ఎస్ (Sri Kartikeya Security Services)ను తక్షణమే తొలగించి కొత్త సెక్యూరిటీ ఏజెన్సీని నియమించాలి: పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థి పితాని సందీప్ గౌడ్





ప్రజాబాట, హైదరాబాద్, జూలై 07: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్)లో గత *12 సంవత్సరాలుగా శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ (SKSS)* భద్రతా సేవలు అందిస్తున్నప్పటికీ, యూనివర్సిటీలో భద్రతా వ్యవస్థ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని *పీహెచ్‌డీ (పరిశోధక) విద్యార్థి పితాని సందీప్ గౌడ్* ఆరోపిస్తూ Jntuh రెక్టర్ దామోదరంకి వినతి పత్రం సమర్పించారు. ఇప్పటికే *20042026, 09062026 తేదీల్లో* పలుమార్లు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదులు, వినతిపత్రాలు సమర్పించినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. ఇటీవల రాత్రి వేళల్లో యూనివర్సిటీ క్యాంపస్, బాలుర హాస్టళ్ల వద్ద, విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు *విధి నిర్వహణలో ఉండాల్సిన సమయంలో నిద్రపోతున్న దృశ్యాలు*, అలాగే హాస్టళ్ల పరిసరాల్లో *మద్యం సీసాలు, బీర్ బాటిళ్లు* కనిపించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రాత్రి వేళల్లో విద్యార్థులు క్యాంపస్‌లోకి మద్యం, ఇతర నిషేధిత వస్తువులు తీసుకువస్తున్నారని, దీంతో హాస్టళ్లలో మద్యం సేవించడం, గొడవలు, క్రమశిక్షణా ఉల్లంఘనలు పెరుగుతున్నాయని అన్నారు.

గతంలో యూనివర్సిటీ యాజమాన్యం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకున్నప్పటికీ, సెక్యూరిటీ వ్యవస్థలో మూలపూర్వక మార్పులు చేయకపోతే ఇటువంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

- శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ పనితీరుపై ఉన్నతస్థాయి విచారణ నిర్వహించాలి.
- ప్రస్తుతం అమలులో ఉన్న ఒప్పందం, టెండర్, పాడిగింపులు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలి.
- విధుల్లో నిర్లక్ష్యం వహించిన సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.
- జేఎన్‌టీయూహెచ్ ప్రధాన క్యాంపస్‌తో పాటు అన్ని రాజ్యాంగ కళాశాలల్లో *కొత్త సెక్యూరిటీ ఏజెన్సీని పారదర్శక టెండర్ విధానంలో నియమించాలి.
- రాత్రి వేళల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి ఆకస్మిక తనిఖీలు పెంచాలి.
- విద్యార్థులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ విషయమై యూనివర్సిటీ రెక్టర్ కి మరోసారి సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థి చల్లా రామకృష్ణ రెడ్డి, బీటెక్ విద్యార్థులు జయరామ్ నాయక్, రామ్, పాల్సన్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాపై రాజీ లేదు..

అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టం

- నా కుటుంబంపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి..ఇసుక మాఫియాను అరికట్టడంలో ప్రభుత్వం కట్టుదిట్టం
- తప్పుడు ప్రచారాలపై చట్టపరమైన చర్యలు తప్పవు
- గత పదేళ్లతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వంలోనే ఇసుక అక్రమాలపై అత్యధిక కేసులు
- రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారాలు చేయొద్దు.. నా ఇమేజ్ డ్యామేజ్ చేసే వారిపై కఠిన చర్యలు
- ప్రజలను తప్పదోవ పట్టించే ప్రచారాలు మానాలి.. అక్రమార్కులపై కఠిన చర్యలు కొనసాగుతాయి: ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

ప్రజాబాట,జడ్చర్ల, జూలై 07,జడ్చర్ల నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, గత పదేళ్లతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే అత్యధిక కేసులు నమోదు చేసి అక్రమాలపై ఉక్కుపాదం మోపినట్లు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలింపుపై సమాచారం అందడంతో పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, చట్టపరమైన చర్యలు చేపట్టారని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారెవరైనా చట్టం ముందు సమానమేనని, ఎలాంటి రాజకీయ లేదా వ్యక్తిగత ఒత్తిళ్లకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన కుటుంబ సభ్యులపై జరుగుతున్న అసత్య ప్రచారాలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. "మా కుటుంబ సభ్యులు ఎవరూ అక్రమ కార్యకలాపాలకు పాల్పడరు. ఒకవేళ ఎవరైనా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నేనే అధికారులను కోరుతాను. అక్రమాలకు ఎలాంటి మద్దతు ఉండదు" అని స్పష్టం చేశారు. జడ్చర్ల నియోజకవర్గంలోని దుందుభి వాగులతో పాటు ఇతర వాగుల్లో ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేకపోవడానికి గత పదేళ్లలో జరిగిన విచ్చలవిడి అక్రమ తవ్వకాలే కారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చింది, ఎన్ని కేసులు నమోదయ్యాయో లెక్కలు పరిశీలించాలని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం, నమోదైన కేసుల వివరాలను కూడా ప్రజల ముందుంచాలని సూచించారు.